క్లుప్తంగా

'ఓబీసీ జాబితాలోకి శిష్టకరణాలు'



కృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్

బీచ్ రోడ్డు: శిష్ట కరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేలా వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించేందుకు కృషి చేస్తానని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హామీ ఇచ్చారు. నగరంలో ఉన్న కృష్ణయ్యను ఆదివారం ఏపీ శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్, శిష్టకరణ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, వినతి పత్రం అందజేశారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన ఆవశ్యకతను, ఇంత వరకు జరిగిన ప్రక్రియను, రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారాన్ని ఎంపీకి వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఓబీసీలో చేర్చేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో శిష్టకరణ సంఘం జాతీయ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి, జయితి శ్రీధర్, కుమార్ స్వామి పాల్గొన్నారు.

లుంబినీ పార్కులో బుద్ధ వందనం



బుద్ధ వందనం సమర్పిస్తున్న బీఎస్ఐ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అప్పుఘర్ దరి లుంబినీ పార్కులోని బుద్ధుడి విగ్రహానికి పలువురు బుద్ధ వందనం సమర్పించారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బోర వేణుగోపాల్ హాజరైన వారితో బుద్ధవందనం చేయించారు. ఈ సందర్భంగా మల్లయ్యరాజు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి బౌద్ధ ధర్మమే శరణ్యం అన్నారు. బుద్ధుడి బోధనలు ప్రతి ఒక్కరూ ఆచరిస్తే సమాజంలో సమ సమానత్వం, శాంతి వెల్లివిరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెయ్యిల సిద్ధార్థ, బత్తుల గౌతం బాబూ, అన్నవరం, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు



పోటీ పడుతున్న చిన్నారులు

విశాఖ స్పోర్ట్స్: ప్రపంచ చదరంగం దినోత్సవం సందర్భంగా ఆదివారం మద్దిలపాలెం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. 56 మంది చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొని ఎత్తులకు పైఎత్తులు వేసి ప్రతిభ కనబరిచారు. అరుగురేసి చొప్పున తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి రొటేరియన్ మోదాంబిక సర్టిఫికెట్లు అందజేశారు.

ఉత్సాహంగా స్టోరీ టెల్లింగ్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయం మియావాకీ సెక్షన్‌లో ఆదివారం స్టోరీ టెల్లింగ్ కార్యక్రమం నిర్వహించారు. స్టోరీ టెల్లర్ శ్రీకరుణ ఆసక్తికరమైన కథలు వినిపించారు. 1 నుంచి 4 తరగతి విద్యార్థులు, ఆ తర్వాత 5 నుంచి 8 తరగతి విద్యార్థులకు వేర్వేరుగా కథలు చెప్పారు. అనంతరం కాగితాలతో బొమ్మల తయారీపై పిల్లలకు శిక్షణ ఇచ్చారు. బొమ్మల ద్వారా కథలు చెప్పారు. సుమారు 70 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పౌర గ్రంథాలయం, భారతీయ విద్యాభవన్ స్కూల్ కలిసి సంయుక్తంగా నిర్వహించాయి.

ఈ బడి.. సరికొత్త ఒరవడి

- తోటగరువు హైస్కూల్‌లో ఏడాది 342 దాటిన అడ్మిషన్లు
- తమ పిల్లలను చేర్చేందుకు క్యూ కడుతున్న తల్లిదండ్రులు
- ఆధునిక వసతులు, మెరుగైన ఫలితాలతో గుర్తింపు



తరగతి గదిలో విద్యార్థులు



విశాలమైన ఆట స్థలంతో తోటగరువు హైస్కూల్



డిజిటల్ బోర్డు కమ్ టీవీ



నిర్మాణంలో అదనపు తరగతి గదులు

నాడు: సర్కారు బడులంటే వర్షానికి కారిపోయే తరగతి గదులు.. పెచ్చులూడిన శ్లాబ్‌లు, గచ్చులు, శిథిలావస్థకు చేరిన బాత్‌రూమ్‌లు.. మరోవైపు ఉపాధ్యాయుల కొరత.. సమయానికి అందని పుస్తకాలు.. ఇలా చెబుతూ పోతే ఎన్నెన్నో లోపాలు..

నేడు: కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన పాఠశాలలు.. ఆధునిక వసతులు.. చక్కని బెంచీలు, డెస్కులు, రన్నింగ్ వాటర్ సదుపాయంతో బాత్‌రూమ్‌లు.. పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు.. పాఠశాలలు తెరిచే నాటికే పుస్తకాలతో పాటు యూనిఫాం, బెల్ట్, టై, బ్యాగ్, షూ తదితర వస్తువులతో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ.. ఇలా.. విప్లవాత్మక సంస్కరణలు

ఫలితం : అనూహ్యంగా పెరుగుతున్న అడ్మిషన్లు. సర్కారు బడుల్లో పెరిగిన విద్యా ప్రమాణాలు, ఉత్తీర్ణతను గమనిస్తున్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు క్యూ కడుతున్నారు. ఇందుకు నిదర్శనమే తోటగరువు హైస్కూల్లో 342 దాటిన అడ్మిషన్లు.. ప్రగతి అంటే ఇదీ అని చాటి చెబుతున్న పాఠశాలపై సాక్షి ప్రత్యేక కథనం.

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలోని తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అద్భుత ఫలితాలతో దూసుకుపోతోంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొత్త రూపును సంతరించుకోవడంతో పాటు పదో తరగతిలో చక్కని ఫలితాలు సాధించడంతో తల్లిదండ్రులు ఈ హైస్కూల్లో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో గతేడాదితో పోల్చి చూస్తే ఊహించని రీతిలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇప్పటికే అన్ని తరగతులు కలిపి సుమారు 342కు పైగా విద్యార్థులు చేరినట్లు ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. 9వ వార్డు పరిధి జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, హనుమంతవాక నుంచి 13వ వార్డు పరిధి ఆరిలోవ, రామకృష్ణాపురం, పైనాపిల్ కాలనీ వరకు ఇదొక్కటే ఉన్నత పాఠశాల. దీని పరిధిలో 18 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో ఐదో తరగతి చదివిన విద్యార్థుల్లో ఎక్కువ మంది తోటగరువు ఉన్నత పాఠశాలలో చేరుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 1750 మంది విద్యార్థులున్నారు. వారిలో ఈ ఏడాది ఇంత వరకు 342 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. వీరిలో 6 నుంచి 10వ తరగతి వరకు చేరిన వారు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

సౌకర్యాలు సూపర్

తోటగరువు ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 1750 మంది విద్యార్థులున్నారు. వారి కోసం ప్రస్తుతం 25 గదులు ఉన్నాయి. మరికొన్ని అదనపు గదులు నిర్మాణంలో ఉన్నాయి. నాడు–నేడు పథకంలో భాగంగా ఈ పాఠశాలకు 20 అదనపు గదులు మంజూరయ్యాయి. వాటిలో ప్రస్తుతం 14 గదులు నిర్మాణంలో ఉన్నాయి. మరో 6 గదులు నిర్మించనున్నారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పాఠశాలలో విశాలమైన క్రీడా మైదానం ఉంది. వాలీ బాల్, బాస్కెట్ బాల్ కోర్టులు, జిమ్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలకు 32 డిజిటల్ టీవీలు అందించారు. వాటిని ప్రతి తరగతి గదిలో ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం రెండు చోట్ల చేతి బోర్లు, ఒకచోట ఆర్వో ప్లాంట్ అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు మధ్యాహ్న భోజనం, జగనన్న విద్యా కానుక కిట్లు, అమ్మఒడి పథకాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి.

పెరిగిన ఉపాధ్యాయుల సంఖ్య

ఈ పాఠశాలలో ఉత్తమ బోధన అందించేలా 59 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. గతేడాది వరకు ఇక్కడ 40 మంది ఉపాధ్యాయులు ఉండేవారు. ఇటీవల మరో 19 మంది ఉపాధ్యాయులు జిల్లాలో పలు పాఠశాలల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మొత్తం ఉపాధ్యాయుల్లో ప్రధానోపాధ్యాయురాలు ఒకరు, పీఈటీలు ఇద్దరితో పాటు తెలుగు బోధనకు 8 మంది, హిందీ ఐదుగురు, ఆంగ్లం 9 మంది, గణితం 10 మంది, భౌతిక శాస్త్రం 8 మంది, జీవ శాస్త్రం 8 మంది, సాంఘిక శాస్త్రం బోధనకు 8 మంది ఉన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఇక్కడ పదో తరగతిలో ఐదుగురు 500 పైగా మార్కులు సాధించారు. వారిలో ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం విశేషం.

బోధన బాగుంది..



తోటగరువు హైస్కూల్‌లో మా పిల్లలు కార్తీక్ ఏడో తరగతి, రంజిత్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మధ్యాహ్నం భోజనం పెట్టడంతో పాటు పుస్తకాలు, బ్యాగులు ఇచ్చారు. అన్ని తరగతుల్లో బోధన బాగుంది. ఆడుకునేందుకు చక్కని క్రీడా మైదానం, ఆహ్లాదకర వాతావరణంలో తరగతి గదులు బాగున్నాయి. మా పిల్లలు పదో తరగతి పూర్తయ్యే వరకు ఇక్కడే చదివిస్తాం.

– రామలక్ష్మి, విద్యార్థుల తల్లి, ఆరిలోవ కాలనీ

అందుబాటులో సౌకర్యాలు..



ఇక్కడ విశాలమైన క్రీడా మైదానంతో పాటు, ఆట పరికరాలు, డిజిటల్ బోర్డులు, అనుభవిజ్ఞులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. విద్యార్థుల కోసం నాడు–నేడు పథకంలో అదనంగా 20 తరగతి గదులు మంజూరయ్యాయి. వాటిలో ప్రస్తుతం 14 గదులు నిర్మిస్తున్నాం. ఈ ఏడాది ఇంత వరకు 342 మంది విద్యార్థులు కొత్త వారు చేరారు. ప్రస్తుతం 1750 మంది విద్యార్థులు, 59 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ ఆటలతో పాటు మంచి విద్యా బోధన అందిస్తున్నాం.

– దుర్గాభవాని, హెచ్‌ఎం, తోటగరువు హైస్కూల్

ఆరిలోవ సీఐ ఊదారత

ఆరిలోవ సీఐ సోమశేఖర్ తోటగరువు హైస్కూల్‌లో సుమారు 200 మంది విద్యార్థులను దత్తత తీసుకున్నారు. వారికి వివిధ క్రీడల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. పాఠశాలలో అల్లరి చేసే పిల్లలతో పాటు క్రీడల్లో ఉత్సాహం కనబరిచే వారిని ఆయన ఎంపిక చేశారు. వారికి వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్ నేర్పిస్తున్నారు. వారి కోసం క్రీడా సామగ్రిని సీఐ సమకూర్చారు. వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడానికి కోచ్‌లను ఆయనే నియమించారు.

22 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమసదన్‌లో జరిగిన ఈ శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధులు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి ఎంవీపీ భజన మండలి కన్వీనర్ కె.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కైరో కాంగ్రెస్ సదస్సుకు అపోలో వైద్యుని కథనాల ఎంపిక

ఆరిలోవ: ఈజిప్టు దేశం కైరో నగరంలో ఈ ఏడాది నవంబరులో జరగనున్న ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ అండ్ ట్రామటాలజీ(సికోట్) వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రదర్శనకు హెల్త్‌సిటీలో అపోలో ఆస్పత్రి ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్ రాసిన శాస్త్రీయ కథనాలు ఎంపికయ్యాయి. తాను పంపించిన వాటిలో నాలుగు శాస్త్రీయ కథనాలు ఎంపికైనట్లు ఇటీవల సికోట్ కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ నుంచి లేఖ వచ్చినట్లు ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిని ప్రదర్శించడానికి నవంబర్‌లో కైరో సదస్సుకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

'రల్లా బెల్లా స్కూల్‌పై నివేదిక ఇవ్వండి'

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని రల్లా బెల్లా స్కూల్ నిర్వహణ పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కలెక్టర్, డీఈవోకు లేఖలు పంపినట్లు కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కూల్ మూసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తుందంటూ ఆ స్కూల్ పిల్లల తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్కూల్‌కు ప్రభుత్వ గుర్తింపు ఉందా? నిర్వహణ ఎలా? జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా? అనే విషయాలపై వివరణ కోరినట్లు తెలిపారు. గుర్తింపు లేకపోతే విద్యార్థులకు నష్టం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరించాలని లేఖలో కోరినట్లు సీతారాం పేర్కొన్నారు.

డంపింగ్ యార్డులో చెత్త వాహనాల బారులు



ఇళ్ల నుంచి సేకరించిన చెత్త డంప్ చేయడానికి రోడ్డు పక్కన క్యూలో ఉన్న వాహనాలు

ఆరిలోవ: ముడసర్లోవ డంపింగ్ యార్డు వద్ద చెత్త వాహనాలు బారులు తీరాయి. డంపింగ్ యార్డు గేట్ వరకు చెత్త పేరుకుపోవడంతో వాహనాలు లోపలికి వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. జీవీఎంసీ 2, 3 జోన్ల పరిధిలో ఇళ్ల నుంచి పారిశుధ్య కార్మికులు రోజూ సేకరించిన చెత్తను వాహనాలతో తీసుకొచ్చి ఈ డంపింగ్ యార్డు లోపల పడేసి వెళ్లిపోతున్నాయి. ఈ చెత్తను ఎప్పటికప్పుడు జీవీఎంసీ అధికారులు పొక్లెయిన్‌లతో ఓ మూలకు నెట్టి దిబ్బలుగా వేస్తారు. ఆ చెత్తను మళ్లీ పెద్ద లారీల్లో కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. అయితే ఈ నెల 11 నుంచి పొక్లెయిన్‌లు ఇక్కడ అందుబాటులో లేవు. చెత్త వాహనాలు డంపింగ్ యార్డులో నాలుగు రోజుల పాటు ఎక్కడికక్కడ డంప్ చేసి వెళ్లిపోతున్నాయి. దీంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. ఈ చెత్త యార్డులో గేటు వరకు పేరుకుపోవడంతో ఇళ్ల నుంచి చెత్త తీసుకెళ్లే వాహనాలు లోపలకు ప్రవేశించే వీలు లేకుండాపోయింది. దీంతో చెత్త వాహనాలు యార్డు గేటు బయటే నిలిచిపోయి రోడ్డుపై బారులు తీరాయి. కొందరు వాహనాల డ్రైవర్లు క్యూలో నిరీక్షించలేక యార్డు పక్కన చెత్త డంప్ చేసి వెళ్లిపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పారిశుధ్య విభాగం అధికారులు శనివారం రెండు పొక్లెయిన్‌ను ఆగమేఘాలపై పంపించారు. ఆ చెత్తను యార్డులో ఓ మూలకు చేర్చడానికి రెండురోజులు పట్టింది. దీంతో శని, ఆదివారాలు చెత్త వాహనాలను ఒకదాని తర్వాత ఒకటి నంబర్ల వారీగా పంపించి డంప్ చేయించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యార్డులో నిత్యం పొక్లెయిన్లను అందుబాటులో ఉంచాలని చెత్త వాహనాల డ్రైవర్లు కోరుతున్నారు.

శాకంబరిగా దుర్గాదేవి



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఎంవీపీ కాలనీ ఆదర్శనగర్‌లోని శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో ఆషాఢ మాసం చివరి రోజు సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులతో పాటు భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ రకాల కూరగాయల అలంకరణలో శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వలంటీర్ వల్ల చాలా లబ్ధి పొందాం..



లబ్ధిదారుడు రమేష్..

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్ ప్రాంతం పోస్టాఫీస్ సమీపంలో కళింగ వైశ్య(బీసీ–డీ) సామాజిక వర్గానికి చెందిన తాము కుటుంబంతో నివాసముంటున్నాం. నా కుమారుడడు బీటెక్ చదువుకోవడానికి మూడేళ్ల క్రితం వలంటీరు దగ్గరుండి ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేయించారు. ఇప్పుడు ఆ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుతున్నాడు. ఇటీవల మా అందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. దీంతో వలంటీరు వచ్చి నాతో పాటు భార్య, ఇద్దరు పిల్లలతో దరఖాస్తు చేయించారు. బుధవారం పదో వార్డులో జరిగిన జగనన్న సురక్ష సభలో అధికారుల చేతుల మీదుగా కుల ధ్రువీకరణ పత్రాలు అందుకున్నాం. ఇలా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ తప్పుగా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదు.

– గంబలి రమేష్, లబ్ధిదారు, ఆదర్శనగర్

ఇంటికి వెళ్లి ప్రజా సేవ



వలంటీర్ శారధ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని నియమించినప్పటి నుంచి ప్రజలకు ఇంటికి వెళ్లి సేవలు అందిస్తున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి నాలుగు, ఐదు రోజుల పాటు తెల్లవారుజామున వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇంటికి వెళ్లి పింఛన్ ఇస్తున్నాం. ప్రస్తుతం ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేయించాను. జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైనవారికి అధికారుల చేతుల మీదుగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందేలా చేస్తున్నాను. ఇలాంటి సేవలు అందించే మమ్మల్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిందించడం బాధాకరం. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలి.

– శారదా, వలంటీర్, 23వ సచివాలయం, ఆదర్శనగర్

వ్యాధుల కాలం..జర భద్రం



కేజీహెచ్ మెడికల్ ఓపీలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



దాబాగార్డెన్స్ : వర్షాకాలం వచ్చేసింది. ఈ సమయంలో వాతావరణ మార్పుల వల్ల సంభవించే సాధారణ వ్యాధులతో పాటు కలుషిత నీరు, అపారిశుధ్యం వల్ల పలు వ్యాధులు దాడి చేస్తాయి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే కాలమిది. దోమల వల్ల వ్యాపించే విషజ్వరాలు, నీటి కాలుష్యం వల్ల సంభవించే డయేరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులు..

మలేరియా: దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల్లో మలేరియా ఒకటి. ఈ జ్వరానికి కారణం ప్లాస్మోడియం అనే సూక్ష్మజీవి. రోగి శరీరంలో ఈ సూక్ష్మజీవులుంటాయి. అనాఫిలిస్ జాతికి చెందిన ఆడ దోమ ఈ రోగిని కుట్టి రక్తంతో పాటు సూక్ష్మ జీవులను కూడా పీల్చుకుంటుంది. అలాంటి దోమ ఇతర ఆరోగ్యవంతులను మళ్లీ కుట్టినప్పుడు వారికి సంక్రమిస్తుంది. ఈ దోమ మురుగుకాల్వల్లోని మంచినీటిలో వృద్ధి చెందుతాయి.

లక్షణాలివి: దోమ కుట్టిన పది నుంచి 14 రోజుల్లో మలేరియా వ్యాధి లక్షణాలు బయటపడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్ని సార్లు వాంతులు కావడం జరుగుతుంది. జ్వరం వచ్చిన తొలి రోజే మలేరియా నిర్ధారించవచ్చు. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

డెంగ్యూ : నల్లగా ఉండే ఈ దోమపై తెలని మచ్చలు ఉంటాయి. తన శరీరంలోకి డెంగ్యూ వైరస్ ప్రవేశించిన వారం రోజుల తర్వాత దీనిని మనుషులకు వ్యాపింపచేస్తుంది. ఇది కుట్టినప్పుడు నొప్పి ఉండదు. పగటిపూట ఎక్కువగా సంచరించే ఈ దోమ ఆ సమయంలోనే కుడుతుంది. మూతల్లేని నీటి ట్యాంకులు, సిమెంటు, తారు రోడ్లపై నిలిచే నీరు, తాగేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, నీటి గాజులు, ఇళ్లలోని రిఫ్రిజిరేటర్లు, కూలర్లలో నిల్వ ఉండే నీటిలో డెంగ్యూ కారక దోమ వృద్ధి చెందుతుంది. దోమ కుట్టిన వారం రోజుల తర్వాత ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, కొందరిలో శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

డయేరియా..

కలుషితనీరు, నిల్వ ఆహారం ద్వారా అతిసార వస్తుంది. రోగికి ఒక రోజులో 10 నుంచి 15 సార్లు నీళ్ల విరేచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువ అవుతాయి. రోజులో నాలుగు నుంచి ఐదు సార్లు విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. ఎక్కువ సార్లు విరేచనాలు కావడం వల్ల శరీరంలోని నీరు, లవణాలు, పొటాషియం, గ్లూకోజ్ శాతం తగ్గిపోయి రోగి షాక్‌లోకి వెళ్తాడు. రోగి త్వరగా డీ హైడ్రేషన్ దశకు చేరుతాడు. ఈ వ్యాధి ప్రభావం చిన్నారులు, మధుమేహరోగులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ఎక్కువగా ఉంటుంది.

వైరల్ ఫీవర్ (విషజ్వరం): వాతావరణంలో మార్పు, కొన్ని రకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ వస్తుంది. ఇంట్లో ఒకరికి విషజ్వరం వస్తే మిగిలిన కుటుంబ సభ్యులకు కూడా వచ్చే అవకాశం ఉంది. దీని ప్రభావం వారం నుంచి పది రోజుల పాటు ఉంటుంది. రోగికి 103 నుంచి 107 డిగ్రీల వరకు జ్వరం వస్తుంది. గొంతునొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటినొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు కూడా అవుతాయి.

తీసుకోవల్సిన జాగ్రత్తలు..

- దోమల వల్ల ఎక్కువ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. కనుక వాటి వ్యాప్తిని అరికట్టే చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా నీరు, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- దోమతెరలు వాడాలి.
- కాచి చల్లార్చిన నీరు తాగాలి.
- చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఏదైనా తినే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి.
- తాజా పండ్లు, కూరగాయలు నీటితో శుభ్రంగా కడిగిన తర్వాత తీసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలి.
- ఆహార పదార్థాలపై ఎప్పుడూ మూత ఉండేలా చూడాలి.
- జలుబుకారక క్రిములను నివారించే సి విటమిన్ ఉన్న నిమ్మకాయ, బత్తాయి వంటివి తీసుకోవాలి.

అప్రమత్తత అవసరం..



వర్షాకాలంలో సీజనల్‌గా వ్యాపించే మలేరియా, డయేరియా, డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తత అవసరం. డయేరియా సోకిన రోగికి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి. లేదంటే వారు కూడా వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. డయేరియా సోకిన వ్యక్తికి కొబ్బరినీళ్లు, మజ్జిగ తాగించాలి. లీటర్ నీటిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ కలిపి 3 నుంచి 4 గంటల వ్యవధిలో తాగించాలి. మంచి నీళ్లు కాచి చల్లార్చి తాగాలి. నిల్వ ఆహార పదార్థాలు తినకూడదు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలి.

– ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణ, జనరల్ మెడిసిన్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

దాబాగార్డెన్స్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ సంఘాల నాయకులతో చర్చించి వారికి న్యాయం చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధ సంస్థ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. లలిత కోరారు. అసోసియేషన్ విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల సదస్సు ఆదివారం అల్లిపురంలో గల నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అతి తక్కువ గౌరవ వేతనాలకు పని చేస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు విజయవంతం చేసేందుకు నిత్యం గ్రామీణ, పట్టణ నిరుపేద కుటుంబాలు, గర్భవతులు, బాలింతలకు, సున్నా నుంచి ఆరేళ్ల పిల్లల వరకు సేవలందిస్తున్నారని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ భారమై అప్పులు తెచ్చి కేంద్రాలు నిర్వహించాల్సిన స్థితి ఏర్పడుతుందన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసోసియేషన్లను ఆహ్వానించి, చర్చించి మంచి వేతనాలు అమలు చేయాలని, ఈఎస్ఐ, పెన్షన్, ఇన్సూరెన్స్ అమలు చేయాలని, విధుల్లో చనిపోయిన వారికి రూ. ఐదు లక్షలు ఇవ్వాలని, వారి ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ విజయనగరం జిల్లా నాయకుడు డేగల అప్పలరాజు, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బేగం తదితరులు పాల్గొన్నారు.

రెండు జిల్లాల నూతన కమిటీ..

సమావేశం అనంతరం విశాఖ, విజయనగరం ఉమ్మడి జిల్లాల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షురాలిగా అనిత, ఉపాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అనురాధ, సహాయ కార్యదర్శిగా అరుణ, కోశాధికారిగా నరసయ్యమ్మ, కమిటీ సభ్యులుగా కుమారి, విజయ, కొండమ్మ, సీతను ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఈగల అప్పలరాజు, అధ్యక్షురాలిగా రమణి, ఉపాధ్యక్షురాలిగా మణి, కార్యదర్శిగా మాణిక్యం, సహాయ కార్యదర్శిగా సుశీల, కోశాధికారిగా రమణ, సభ్యులుగా కుమారి, సరోజిని, యశోద, కనకమహాలక్ష్మి, హైమావతి తదితరులను ఎన్నుకున్నారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధారలో కొలువైన కొత్త మహాలక్ష్మి అమ్మ వారి పండగ ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామున 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.